

అంతర్‌రాష్ట్ర దొంగ అరెస్ట్

చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను బుధవారం ఆత్మకూరు(ఎస్) మండల పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



సరుకులు పక్కదారి

ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో బియ్యం, కోడిగుడ్లు పక్కదారి పడుతున్నాయి. - 8లో



ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి

హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న రామారావు, చందర్‌రావు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. బుధవారం కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావుతో కలిసి చింతలపాలెం మండలం దొండపాడులో గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. అనంతరం ఇటీవల గ్రామంలో మృతిచెందిన ఇందూరి కృష్ణవేణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌పీ ఎడమ కాలువ మాజీ చైర్మన్‌సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాది బొబ్బ కోటిరెడ్డి, అన్నపరెడ్డి లక్ష్మారెడ్డి, గోపిరెడ్డి పుల్లారెడ్డి, కందిబండ నరసింహారావు, ఎల్ఐసీ వెంకట్‌రెడ్డి, కలగొట్ల రామిరెడ్డి పాల్గొన్నారు.

రైతులందరికీ న్యాయం చేస్తాం



జాన్‌పహాడ్ గ్రామంలో రైతులతో సమావేశమైన ఆర్డీఓ శ్రీనివాసులు

పాలకవీడు: జాన్‌పహాడ్ పరిధిలో కృష్ణానదిపై సాగునీటి లిఫ్ట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ తగిన న్యాయం చేస్తామని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. లిఫ్ట్ పథకంతో భూములు కోల్పోయిన రైతులతో బుధవారం ఆయన జాన్‌పహాడ్ గ్రామంలో సమావేశమయ్యారు. ఎక్కువ మొత్తంలో రైతులకు పరిహారం అందేలా చూడాలని రైతుల తరుపున కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్వీ.సుబ్బారావు అధికారులను ఈ సందర్భంగా కోరారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్ విలువకు అనుగుణంగా రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. ఈ విషయమై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సంప్రదింపులు జరపనున్నట్లు తెలిపారు. రైతుల అభిప్రాయాలను నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు సమర్పిస్తానని ఆర్డీఓ పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కమలాకర్, పంచాయితీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం నిత్యారాధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆతర్వాత విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు పాల్గొన్నారు.

రెండు మాసాల్లో నివేదిక



నల్లగొండ కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న ఎస్సీ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్

- ఎస్సీ వర్గీకరణపై జిల్లాల వారీగా అధ్యయనం చేస్తున్నాం
- షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అఖ్తర్
- నల్లగొండ కలెక్టరేట్‌లో దళిత సంఘాల నుంచి వినతుల స్వీకరణ

నల్లగొండ: 'ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో దీనిపై అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. కమిషన్ చైర్మన్‌గా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి వివిధ సంఘాల నుంచి వినతులు స్వీకరించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటున్నాను. నివేదికను రెండు నెలల్లో ప్రభుత్వానికి అందజేస్తాను' అని షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ చైర్మన్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ డాక్టర్ షమీమ్ అఖ్తర్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై అధ్యయనంలో భాగంగా బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది. దళిత సంఘాల నుంచి వినతులు పత్రాలు స్వీకరించింది. ఈ సందర్భంగా షమీమ్ అఖ్తర్ మాట్లాడుతూ ఇప్పటికే సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో కమిషన్ పర్యటన చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నల్లగొండ జిల్లాకు వచ్చామన్నారు. కొందరు వర్గీకరణకు అనుకూలంగా, మరికొందరు వ్యతిరేకంగా వినతులు సమర్పించడంతోపాటు వారి అభిప్రాయాలను కమిషన్ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి అందరి అభిప్రాయాలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట కమిషన్ అడిషనల్ డైరెక్టర్ శ్రీధర్, కోర్టు మాస్టర్ మధుసూదన్‌రెడ్డి, పర్యవేక్షకుడు సజ్జన్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అభిప్రాయాలు ఇలా..

- ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మాదిగ ఉద్యోగ, విద్యార్థి, ఉప కుల సంఘాల ఆధ్వర్యంలో విజ్ఞప్తి చేశారు. ఏళ్ల తరబడి వర్గీకరణ కోసం పోరాటాలు జరిగాయని అన్నీ పరిశీలించిన సుప్రీం కోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, ఆ తీర్పు మేరకు ప్రభుత్వం వెంటనే వర్గీకరణ చేయాలని వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మల్లెపాక వెంకట్, జిల్లా కోఆర్డినేటర్ కందుకూరి సోమయ్య, చిప్పలపల్లి సోమశేఖర్, జానకి రామయ్య చౌదరి, బకరం శ్రీనివాస్‌మాదిగ, బోడ సునీల్‌మాదిగ, ఇరిగి శ్రీశైలం, కందుల మోహన్, వినయ్, రామకృష్ణ, చిన్న శ్రీరాములు, మాచర్ల సైదులు, నాగార్జున, బొజ్జ దేవయ్య, కత్తుల సన్నిలు కోరారు.
- అదే విధంగా దళిత సంఘం నాయకుడు పెరిక ఉమా మహేశ్వర్ వర్గీకరణ అమలు చేయాలని కమిషన్‌కు వినతి అందజేశారు.
- విద్యావంతుల వేదిక సంఘం నాయకులు పందుల సైదులు, ఐతగోని జనార్ధన్‌గౌడ్, వడ్డె బోయిన సైదులు, ఐఎన్‌టీయూసీ నాయకులు సైదులు వినతి అందజేశారు.
- ఎరుకల సంఘం నాయకులు మానుపాటి భిక్షం వర్గీకరణకు అనుకూలంగా వినతిపత్రం సమర్పించారు.
- ఎస్సీ వర్గీకరణ ఉద్యమం 30 ఏళ్ల పాటు సాగిందని.. ఇకనైనా వర్గీకరణ సమస్యకు పరిష్కార మార్గాన్ని చూపాలంటూ ధర్మసమాజ్ పార్టీ ఉమ్మడి జిల్లా నాయకులు కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తలారి రాంబాబు, లింగస్వామి, శంకర్, శాంతికుమార్, నగేష్ ఉన్నారు.
- బేడ బుడిగ జంగాలకు న్యాయం చేయాలని, విద్య, ఉద్యోగాలకు దూరంగా ఉన్నామని, మాది సంచార జాతి అని, కనీసం కులం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని బేడ బుడిగ జంగాల సంఘం నాయకుడు శ్రీను కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. మండల కార్యాలయానికి పోతే కుల సర్టిఫికెట్ ఇవ్వక పిల్లలను చదివించలేకపోతున్నామని, మా కులానికి న్యాయం జరిగేలా కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.
- ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి విరుద్ధమని దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామంటూ మాల, మాల ఉపకులాల నాయకులు కమిషన్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని.. మాలల్లో కూడా వెనుకబడిన వారున్నారని పేర్కొన్నారు. 59 కులాల డేటా తీసుకుని ఎవరైతే వెనుకబడి ఉన్నారో రోస్టర్ పద్ధతిలో అత్యవసర చర్యల కింద విద్య, ఉద్యోగ, వైద్య, ఆరోగ్య, ఉపాధి, ఆర్థికంగా అభివృద్ధి చేయాలని కోరారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్, జిల్లా అధ్యక్షుడు లకుమల్ల మధుబాబు, గోలి సైదులు వేర్వేరుగా వినతులు సమర్పించారు.



కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

అక్రమ వ్యాపారాలను ఉపేక్షించం



సమావేశంలో మాట్లాడుతున్న మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, చిత్రంలో ఇన్‌చార్జి ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు

- పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

సూర్యాపేట టౌన్: అక్రమ వ్యాపారాలు చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సబ్ డివిజనల్ పోలీస్ సిబ్బంది సమావేశంలో ఆయన పాల్గొని అనంతరం విలేకరులతో మాట్లాడారు. పీడీఎస్ బియ్యం, ఇసుక, గుట్కా, గంజాయి లాంటి వాటితో అక్రమ వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఇలాంటి అక్రమ వ్యాపారాలను సమూలంగా నిర్మూలించాల్సిన బాధ్యత పోలీస్ శాఖపైనే ఉందన్నారు. అక్రమ వ్యాపారాలతోపాటు గంజాయి రవాణా, వినియోగం, జూదం లాంటివి సమాజానికి హాని కలిగించేవన్నారు. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న నరసింహారావు, జగదీష్ అనే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేశామని, సూర్యాపేటలో బియ్యం అక్రమ రవాణాతో అనుమానం ఉన్న కాసం రమేష్, శంకర్, భిక్షపతిగౌడ్, శివకుమార్‌తో పాటు నల్లగొండలో ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకొని ఎస్పీ ఆధ్వర్యంలో విచారణ చేస్తున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై కేసులు నమోదు చేసి బైండోవర్ చేస్తున్నామని తెలిపారు. అక్రమ రవాణాకు పోలీసులు సహకరిస్తే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. మన రాష్ట్రంలోకి ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా కట్టడి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు రవి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2కు పటిష్ట బందోబస్తు

ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షలకు సంబంధించి సూర్యాపేట పట్టణంలో 30, కోదాడ పట్టణంలో 19 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు బుధవారం ఆయన సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. సందర్భంగా ఐజీ మాట్లాడారు.

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పశుగణన పూర్తి

- జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు

నేరేడుచర్ల: జిల్లాలో చేపట్టిన పశుగణన ప్రక్రియను 2025 ఫిబ్రవరి 28వ తేదీలోగా పూర్తిచేస్తామని జిల్లా పశువైద్యాధికారి డి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నేరేడుచర్ల, పెంచికల్‌దిన్న పశువైద్యాశాఖలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువులు, కుక్కలు, గొర్రెలు, మేకల గణాంకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 486 గ్రామాల్లో పశుగణన ప్రారంభం కాగా ఇప్పటి వరకు ఆరు గ్రామాల్లో పూర్తికాగా 157 గ్రామాల్లో ముమ్మరంగా సాగుతుందన్నారు. గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు ఇచ్చేందుకు 48 బృందాలను నియమించామన్నారు. జిల్లాలో 41 మంది పశు వైద్యాధికారులకు గాను చింతలపాలెం మండలం దొండపాడు, తుంగతుర్తి మండలం వెంపటి పశు వైద్యశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 85 పారా వెటర్నరీ పోస్టులకు గాను 50 పోస్టులు ఖాళీగా ఉండగా ఇందులో ఎక్కువగా అటెండర్ పోస్టులే ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటి భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట జిల్లా పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు సత్యనారాయణ, సూర్యాపేట సహాయ సంచాలకుడు వెంకన్న, పెంచికల్‌దిన్న పశు వైద్యాధికారి నరేష్ తదితరులు ఉన్నారు.



నేరేడుచర్ల పశు వైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి శ్రీనివాసరావు

ప్రతి స్కూల్‌లో టీచర్ల ఫొటోలు

- గ్రామస్తులు గుర్తుపట్టేలా ప్రదర్శించాలని విద్యాశాఖ ఆదేశం
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా..
- ఫొటోల సేకరణలో హెచ్ఎంలు



నాగారం జెడ్పీ ఉన్నత పాఠశాల

నాగారం: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకొస్తోంది. దీంట్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్లను గ్రామస్తులంతా గుర్తుపట్టేలా ప్రతి పాఠశాలలో వారి ఫొటోలను ప్రదర్శించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అక్కడక్కడా ఉపాధ్యాయులు తరుచూ పాఠశాలకు రాకుండా డుమ్మాలు కొడుతున్నారు. కొందరు దీర్ఘకాలికంగా రాకుండా వారికి బదులు వలంటీర్లను పెట్టి బోధన చేయిస్తున్నారు. దీంతో వలంటీర్లు వచ్చిరాని చదువు చెబుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. అయితే అసలు ఉపాధ్యాయులు ఎవరో గ్రామస్తులకు తెలియకపోవడంతో గతంలో జిల్లాలో ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. ఇక నుంచి అలాంటి జరగటానికి ఏ మాత్రం అవకాశం లేకుండా ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల ఫొటోలను ప్రదర్శించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఒకరికి బదులు మరొకరు రాకుండా..

గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను కొందరు గ్రామస్తులు గుర్తుపట్టడం కష్టంగా ఉంటుంది. అప్పుడప్పుడు వచ్చేవారు తెలియదు. అలాంటి పరిస్థితుల్లో పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఫొటోలు ఉంటే వెంటనే గుర్తిస్తారు. ఇలా చేయటం వల్ల ఒకరికి బదులు మరొకరు పనిచేయ దానికి ఏమాత్రం వీలు ఉండదు. తద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలు, తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల, కేజీబీవీలు, గురుకులాల్లో పనిచేసే ఉపాధ్యాయుల ఫొటోలను అందరికీ కనిపించే ప్రాంతాల్లో ఉంచనున్నారు.

ఫొటోల సేకరణ ప్రక్రియ ప్రారంభం

విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న పాఠశాలల్లో ఆగమేఘాల మీద ఉపాధ్యాయుల పాస్ ఫొటోలను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించారు. గతంలో కేవలం ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాలు మాత్రమే ఉండేవి. కానీ ఇక నుంచి వివరాల పక్కనే వారి ఫొటోలను కూడా ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఫొటోలను ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు..

ప్రాథమిక పాఠశాలలు	680
ప్రాథమికోన్నత	78
జెడ్పీ ఉన్నత	182
ఆదర్శ స్కూళ్లు	09
కేజీబీవీలు	18

ఫొటోలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇచ్చాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఫొటోలను ప్రదర్శించాలని ఆదేశాలు ఇచ్చాం. ఇకనుంచి ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల ఫొటోలతోపాటు వారి వివరాలను ప్రదర్శిస్తాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

వైభవంగా లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవారికి లక్ష పుష్పార్చన పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి వివిధ రకాల పుష్పాలు, తులసీ దళాలతో అర్చన చేశారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాత సేవ , ఆరాధన, అభిషేకం, అర్చన, సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం తదితర పూజలు నిర్వహించారు.

రాష్ట్ర ఒలింపిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడిగా కర్తయ్య




జి.కర్తయ్య

నాగార్జునసాగర్ : ఒలింపిక్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గొట్టిపాటి కర్తయ్య ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన నల్లగొండ ఒలింపిక్స్, కబడ్డీ అసోసియేషన్లకు కార్యదర్శిగా, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. కర్తయ్య అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో ఉస్మానియా యూనివర్సిటీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించారు. సౌత్‌జోన్ జాతీయ కబడ్డీ పోటీల్లో బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నారు. జాతీయ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.

బడిబయట పిల్లలను గుర్తించేలా..

- నేటి నుంచి ఓఎస్‌సీ సర్వే
- జనవరి 11వ తేదీ వరకు ప్రక్రియ
- విద్యార్థుల వయసును బట్టి రెండు కేటగిరీలుగా గుర్తింపు
- బాలకార్మికులను బడిలో చేర్పించడమే లక్ష్యంగా విద్యాశాఖ కార్యాచరణ



సూర్యాపేట టౌన్: బడిబయట ఉన్న బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలనే లక్ష్యంతో విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బడిబయట పిల్లల (ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్స్–ఓఎస్‌సీ) గుర్తించేలా సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ఈ నెల 12 నుంచి సర్వే చేయాలని ఇప్పటికే సీఆర్పీలు, ఐఈఆర్పీలకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో సంబంధిత సిబ్బంది సర్వేకు సిద్ధమయ్యారు. చదువుకునే వయసులో ఆర్థిక స్థోమత, కుటుంబ పరిస్థితుల కారణంగా చాలామంది పిల్లలు బడికి వెళ్లడం లేదు. కొందరు ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ కూలి పనులకు వెళ్తుంటే. ఇంకొందరు కుల వృత్తిలో కొనసాగుతున్నారు. మరికొందరు హోటళ్లు, బేకరీల్లో పనిచేస్తూ విద్యకు దూరమవుతున్నారు. ఫలితంగా ఉన్నత విద్యనభ్యసించాలన్న వారి ఆశయం నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది.

బడిబాటే లక్ష్యంగా..

బడీడు పిల్లల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా పాఠశాలలకు రాని బడీడు పిల్లల లెక్క తేల్చేందుకు విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలబాలికల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ చాలామంది చిన్నారులు బడికి దూరంగానే ఉంటున్నారు. ఎన్ని సర్వేలు చేసినా.. పిల్లలు చదువుకోవాలని అధికారులు పదేపదే చెబుతున్నా, బాల్యం మాత్రం వివిధ పనుల్లో మగ్గుతోంది. వీరందరినీ గుర్తించి బడిలో చేర్పించాలనే లక్ష్యంతో విద్యాశాఖ ఈ నెల 12 నుంచి జనవరి 11 వరకు దాదాపు నెల రోజుల వరకు సర్వే చేయనుంది.

వేర్వేరుగా పిల్లల గుర్తింపు

సర్వే ద్వారా 6–14 ఏళ్ల లోపు బడీడు పిల్లలను, కళాశాల స్థాయిలో 15–19 ఏళ్ల పిల్లలను వేర్వేరుగా గుర్తించి జాబితా రూపొందించనున్నారు. విద్యార్థి సామర్థ్యం, వయసు ప్రకారం వీరి అర్హత ఆసక్తిని బట్టి తగిన తరగతిలో చేర్పించటం, అలాగే దూర విద్యలో ప్రవేశాలు కల్పించేలా అధికారులు కృషి చేయనున్నారు. విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్షా కింద పనిచేసే సీఆర్పీలు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి సర్వే చేయనున్నారు. చదువు నిలిపేశారనే అంశాలు, పరిస్థితులపై ఆరా తీస్తారు. ఆవాస ప్రాంతాలు, గృహాలు, పని ప్రదేశాలను సందర్శించి ఆరా తీసి వివరాలను ప్రొఫార్మాలో నమోదు చేస్తారు. అనంతరం జాతీయ స్థాయి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. వారిని వచ్చే విద్యా సంవత్సరం నుంచి బడికి రప్పించేలా చర్యలు తీసుకుంటారు. ఆసక్తి ఉన్న వారిని వృత్తి విద్యాకోర్సుల్లో చేర్పించనున్నారు.

సర్వేపై సమ్మె ప్రభావం!

ఓ వైపు విద్యాశాఖ బడి బయటి పిల్లలను గుర్తించే సర్వే చేయాలని ఆదేశించగా, మరోవైపు సమగ్ర శిక్షా అభియాన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రధానంగా సర్వే చేయాల్సిన సీఆర్పీలు, ఐఈఆర్పీ తదితర ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఓఎస్‌సీ సర్వేపై ఉద్యోగుల సమ్మె ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

సమ్మెలో పాల్గొనని వారితో సర్వే

ఈ నెల 12 నుంచి బడిబయట పిల్లల గుర్తింపు సర్వే చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే సమగ్ర శిక్షా ఉద్యోగులకు సమాచారం చేరవేశాం. ఉద్యోగులు సమ్మె చేస్తున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమ్మెలో పాల్గొనని ఉద్యోగులతో సర్వే కొనసాగిస్తాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

అయ్యప్ప మాలధారుల గిరి ప్రదక్షిణ



ఏకాదశి, గీతా జయంతిని పురస్కరించుకుని బుధవారం ఉదయం యాదగిరికొండ చుట్టూ సామూహిక గిరిప్రదక్షిణ చేస్తున్న అయ్యప్ప మాలధారులు

క్లుప్తంగా

బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన వారిపై కేసు

దేవరకొండ: బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్‌కు చెందిన శివారెడ్డి, సందీప్‌రెడ్డి, రాజేందర్, నవీన్, శివారెడ్డి, రాకేష్ బుధవారం దేవరకొండ పట్టణంలోని ముదిగొండ రోడ్డులో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో మద్యం సేవిస్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వారిని దేవరకొండ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పొట్ట చెన్నయ్య ఎదుట హాజరుపరచగా రూ.6వేల జరిమానా, కమ్యూనిటీ సోషల్ సర్వీస్ కింద ఒక రోజు కోర్టు ఆవరణ శుభ్రం చేయాలని తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్

ఆత్మకూర్(ఎస్): చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను బుధవారం ఆత్మకూరు (ఎస్) పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఆత్మకూర్(ఎస్) మండలం నసీంపేట బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న చివ్వెంల మండలం బండమీది చందుపట్ల గ్రామానికి చెందిన బొందికోళ్ల సైదులును బుధవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. ఆత్మకూరు(ఎస్) మండలంలోని మక్త కొత్తగూడెం ఏపూర్, కోటినాయక్ తండాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలతో పాటు నగదు అపహరించినట్లు నిజం ఒప్పుకున్నాడు. నిందితుడు ఖమ్మం, నేలకొండపల్లి, నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, చిట్యాల, మాడుగులపల్లి, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. అతడి వద్ద ద్విచక్ర వాహనం, మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, సుమారు నాలుగు తులాల వెండి వస్తువులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఆత్మకూర్(ఎస్) ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని మోసం చేసిన మిల్లుల యజమానులు

- కేసు నమోదు చేసిన సివిల్ సప్లయ్ అధికారులు

నేరేడుచర్ల: గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని సంతోషి మా రైస్ కార్పొరేషన్, నేరేడుచర్ల మండలం దిర్శించర్లలోని తిరుమల రైస్ కార్పొరేషన్ యజమానులు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యం ఇవ్వకుండా మోసం చేసినట్లు అధికారుల తనిఖీల్లో వెలుగు చూసింది. 2022–23 ఖరీఫ్, 2023–24 రబీ సీజన్‌తో పాటు ఈ ఖరీఫ్ సీజన్‌లో ఈ రెండు మిల్లులకు ప్రభుత్వం ధాన్యం పంపించగా సీఎంఆర్ బియ్యం ఇవ్వలేదని తేలింది. తిరుమల రైస్ కార్పొరేషన్(పారాబాయిల్డ్)లో రూ.107.16 కోట్ల విలువైన 32,779 మెట్రిక్ టన్నుల ధాన్యం, గరిడేపల్లి మండలంలోని సంతోషి మా కార్పొరేషన్(పారాబాయిల్డ్)లో రూ.110.39 కోట్ల విలువైన 33,936 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అమ్ముకున్నట్లు వెలుగు చూసింది. దీంతో మంగళవారం ఈ రెండు మిల్లులపై కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ డీఎం టీఎస్ఎస్ ప్రసాద్ లేఖ విడుదల చేశారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్.. ఇద్దరు మృతి

- పెద్దవూర మండలం శిర్సనగండ్ల వద్ద ప్రమాదం

పెద్దవూర: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటన బుధవారం రాత్రి పెద్దవూర మండలంలోని శిర్సనగండ్ల గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తుడుం రామలింగయ్య(40), దారం పరమేష్(36) బుధవారం కనగల్ మండలం దర్వేశిపురంలో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరు కొత్తలూరు వైపు నుంచి పెద్దవూర మండలం శిర్సనగండ్ల గ్రామ సమీపంలోని మూలమలుపు వద్దకు రాగానే.. పెద్దగూడెం వైపు నుంచి ట్రాలీ సైడ్ డోర్లు తెరిచి అందులో నువ్వుల కట్టె లోడుతో వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ట్రాక్టర్ ట్రాలీ సైడ్ డోర్లు తెరిచి నువ్వుల కట్టె లోడ్ చేయడంతో పాటు సింగిల్ రోడ్డు కావడంతో ట్రాక్టర్ ట్రాలీ రోడ్డు మొత్తం ఆక్రమించింది. రాత్రి సమయం కావడంతో లైట్ల వెలుతురుకు ట్రాక్టర్ వెనుక ట్రాలీ కనిపించక వీరి ద్విచక్ర వాహనం నేరుగా వెళ్లి ట్రాలీకి బయటకు వచ్చిన డోర్లను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరి తలలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ నడుపుతున్న తుడుం రామలింగయ్య మెడ నుంచి తల వేరుకాగా.. దారం పరమేష్‌ది సైతం తల పగిలింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడు తుడుం రామలింగయ్య గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా, దారం పరమేష్ వ్యవసాయం చేస్తు జీవనం సాగిస్తున్నారు. రామలింగయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా, పరమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. వీరబాబు తెలిపారు.



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు



రామలింగయ్య (ఫైల్)



పరమేష్ (ఫైల్)

యువకుడిపై హత్యాయత్నం

- పదునైన ఆయుధంతో దాడి
- పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఘటన

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి పట్టణ కేంద్రంలో బుధవారం సాయంత్రం ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తండ్రి కొంక లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని వెంకటరమణకాలనీకి చెందిన కొంక సాయికృష్ణ(25) అదే కాలనీలో నివాసముంటున్న వంగ అనిల్ మధ్య బుధవారం మధ్యాహ్నం చిన్న గొడవ జరిగింది. దాంతో సాయికృష్ణపై కక్ష పెంచుకున్న అనిల్ సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సాయికృష్ణపై పదునైన ఆయుధంతో దాడి చేశాడు. ఈ దాడిలో సాయికృష్ణ కడుపు, వీపు, చెవి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. సాయికృష్ణ అరుస్తుండగా ఇరుగుపొరుగు వారు గమనించి వెంటనే కుటుంబ సభ్యులు విషయం తెలియజేశారు. వెంటనే సాయికృష్ణను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడ పరీక్షించిన డాక్టర్ల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయికృష్ణ

అంగన్‌వాడీ సరుకులు పక్కదారి

- విధులకు సక్రమంగారాని అంగన్‌వాడీ టీచర్
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

ఆత్మకూర్(ఎస్): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–3 టీచర్ పద్మ సమయానికి రాకుండా ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తూ.. బియ్యం, కోడిగుడ్లను అక్రమంగా బయటకు తీసుకెళ్తోందని పిల్లల తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అదనంగా ఉన్న బియ్యం వేరే గదిలో ఉండడం, కోడిగుడ్లు దాచిపెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్ విధులకు రాకుండా ఒకేరోజు హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నాట్లు గుర్తించారు. అదనంగా ఉన్న 70 కిలోల బియ్యానికి లెక్క చెప్పకపోవడంతో అంగన్‌వాడీ టీచర్ పద్మకు సూపర్‌వైజర్ అన్నపూర్ణ మెమో జారీ చేశారు. ప్రతిరోజు ఆలస్యంగా వస్తుందని పిల్లల తల్లిదండ్రులు సూపర్‌వైజర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పక్క గదిలో ఉంచిన బియ్యాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ అన్నపూర్ణ

బైక్ పైనుంచి కిందపడి యువకుడి దుర్మరణం

రామన్నపేట: బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం రామన్నపేట మండలం మునిపంపుల గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కక్కిరేణి గ్రామానికి చెందిన బోడ సైదులు కుమారుడైన చిరు(19) రెండేళ్లుగా మానుపాటి నరేష్ అనే వ్యక్తి వద్ద డీజే ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం అమ్మనబోలు వైపు నుంచి నీర్నెములలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్తుండగా మునిపంపుల గ్రామ శివారులో బైక్ అదుపుతప్పడంతో కిందపడి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించారు. పోలీసులు తమ వాహనంలో అతడిని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు.

రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి వద్ద కృష్ణానది వంతెనపై ఏర్పాటు చేసిన రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు తెలిపారు. బుధవారం ఆయన చెక్‌పోస్టును సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు చెక్‌పోస్టులో ఇద్దరు కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించారని, ఇక నుంచి నలుగురు కానిస్టేబుళ్లు ఉంటారని పేర్కొన్నారు. ఆంధ్రా ప్రాంతం నుంచి వరి ధాన్యం ఎట్టి పరిస్థితిల్లోనూ తెలంగాణలోకి రాకుండా చూస్తామన్నారు. వరితో పాటు మద్యం, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు చేయనున్నట్లు వివరించారు. పటిష్ట నిఘా కోసం చెక్‌పోస్టులో త్వరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు.



మట్టపల్లి వద్ద సరిహద్దు చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ బాధితుడికి అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న పోలీసులు

అర్వపల్లి: అర్వపల్లికి చెందిన దావుల లింగయ్య ఇటీవల తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భీమవరానికి చెందిన మహిళ నుంచి సెల్‌ఫోన్ రికవరీ చేయగా.. బుధవారం లింగయ్యకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో అర్వపల్లి ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ సెల్‌ఫోన్ అప్పగించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీ జరిగినా వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అర్వపల్లి ఎస్ఐ సూచించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఐఎంఈఆర్ నంబర్, మీసేవా చలానా నంబర్ తీసుకొని రావాలని అన్నారు.

హత్యాయత్నం కేసులో 8 మంది అరెస్ట్

తిప్పర్తి: మండలంలోని మామిడాల గ్రామంలో మంగళవారం జరిగిన హత్యాహత్యానికి సంబంధించిన కేసులో 8మంది నిందితులను బుధవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మామిడాల గ్రామానికి చెందిన గజ్జి లింగయ్య, చంద్రయ్య సొంత అన్నదమ్ములు. ఇరువురి మధ్య కొంతకాలంగా భూతగాదాలు నడుస్తున్నాయి. గతంలో పెద్దమనుషుల మధ్య పంచాయితీ పెట్టించినా తరచూ ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో చంద్రయ్య కటుంబ సభ్యులను హతమార్చాలని గజ్జి లింగయ్య కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు మంగళవారం చంద్రయ్య కుటుంబ సభ్యులు పొలం దగ్గర పని చేస్తుండగా.. పథకం ప్రకారం లింగయ్య కుటుంబ సభ్యులు వారి కళ్లలో కారం చల్లి గొడ్డళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో చంద్రయ్య భార్య సత్తమ్మ, కుమారులు గజ్జి శంకర్, గజ్జి సైదులు, రామలింగం, విజయలక్ష్మి, లక్ష్మీకాంతంకు గాయాలయ్యాయి. బాధితుడు గజ్జి శంకర్ ఫిర్యాదు మేరకు తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు విచారణ చేసి గజ్జి లింగయ్య, గజ్జి పద్మ, గజ్జి శంకర్, గజ్జి గణేష్, గజ్జి సందీప్, ఏర్పుల నాగయ్య, గట్టిగొర్ల లింగస్వామి, జక్కలి నాగయ్యను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు గొడ్డళ్లు, నాలుగు కర్రలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును విచారించిన శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ సాయిప్రశాంత్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

విద్యార్థి ఆచూకీ లభ్యం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో అదృశ్యమైన విద్యార్థి గుంటూరులో దొరికాడు. హుజూర్‌నగర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి సైదిరెడ్డి కుమారుడు లోకేష్‌రెడ్డి మంగళవారం పాఠశాలకు వెళ్లి వస్తున్న క్రమంలో బస్సు ఎక్కి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో లోకేష్‌రెడ్డి బుధవారం ఇంటికి ఫోన్ చేశాడు. దీంతో పోలీసులు అతడు చేసిన ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గుంటూరులో ఉన్నట్లు నిర్ధారించుకుని అక్కడకు వెళ్లి అతడిని ఇంటికి తీసుకొస్తున్నట్లు తండ్రి సైదిరెడ్డి తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపంతో ఆత్మహత్య

శాలిగౌరారం: పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రాకపోవడంతో పాటు వరకట్నం వేధింపుల కేసు పెట్టి ఇబ్బందులకు గురి చేయడంతో మనస్తాపానికి గురైౖ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లాల గ్రామానికి చెందిన మాదగోని ప్రశాంత్(30)కు సూర్యాపేట పట్టణానికి చెందిన శివజ్యోతితో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె ఉంది. ప్రశాంత్ నకిరేకల్‌లో మొబైల్‌షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం సాఫీగా సాగిన తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో శివజ్యోతి భర్త ప్రశాంత్‌తో తరచూ గొడవ పడి తల్లిగారింటికి వెళ్లేది. వారం రోజుల క్రితం ఇంట్లో భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరగడంతో ప్రశాంత్ శివజ్యోతిపై చేయిచేసుకున్నాడు. ఈ నేపథ్యంలో శివజ్యోతి కుమార్తెను తీసుకుని తల్లిగారింటికి వెళ్లింది. వారం రోజులు గడిచినా ఆమె కాపురానికి తిరిగి రాకపోగా వరకట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారంటూ ప్రశాంత్, అతడి అక్కలపై సూర్యాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ప్రశాంత్‌తో పాటు అతని బంధువులు, మంగళవారం సూర్యాపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ప్రశాంత్‌ను శివజ్యోతి కుటుంబ సభ్యులు తీవ్రమైన పదజాలంతోపాటూ దూషించడంతో పాటూ దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో మనస్తాపానికి గురైన గురైన ప్రశాంత్ ఇంటికి వచ్చి తన ఆత్మహత్యకు భార్య, అత్త, బావమరిది కారకులని వాట్సాప్‌లో స్టేటస్ పెట్టి అర్ధరాత్రి సమయంలో వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకని ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేటస్ చూసి కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి చూడగా అప్పటికే అతడు మృతిచెందాడు. మృతుడి తండ్రి మాదగోని యాదగిరి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రశాంత్ అంత్యక్రియల్లో అతడి భార్య శివజ్యోతి పాల్గొనకపోవడం గమనార్హం.



ప్రశాంత్ (ఫైల్)

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెలు దగ్ధం



జంగంపడిగెలో దగ్ధమైన గుడిసె

పెన్‌పహాడ్: షార్ట్ సర్క్యూట్‌తో నాలుగు పూరి గుడిసెలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ ఆవాసం జంగంపడిగె కాలనీలో బుధవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగంపడిగె కాలనీకి చెందిన కడమంచి సాయమ్మ ఇంట్లో బుధవారం షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న సిలిండర్ పేలడంతో మంటలు ఆర్పేందుకు వెళ్లిన గ్రామానికి చెందిన పర్వతం యలమంచమ్మ, పర్వతం సైదమ్మ, మంగమ్మ, సతీష్, కడమంచి లింగయ్య, నాగయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో సాయమ్మ ఇంటిపై నుంచి నిప్పు రవ్వలు లేచిపడి పక్కనే ఉన్న కడమంచి గంగమ్మ, పర్వతం లక్ష్మణ్, లక్ష్మమ్మ పూరి గుడిసెలపై పడడంతో వారి ఇళ్లు కూడా కాలిపోయాయి. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న సామగ్రి, బంగారం, వెండి ఆభరణాలు, నగదు దగ్ధమైనట్లు ఆర్ఐ రంజిత్‌రెడ్డి పంచనామా నిర్వహించారు. సుమారు రూ.15లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. సూర్యాపేట నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేశారు. బాధిత కుటుంబాలకు ఆర్ఐ రంజిత్‌రెడ్డి ప్రభుత్వం నుంచి 10కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు.

రైఫిల్ షూటింగ్‌లో జాతీయ స్థాయికి ఎంపిక



వెన్నెల

నడిగూడెం: మండల పరిధిలోని కరివిరాల ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బి. వెన్నెల రైఫిల్ షూటింగ్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్పోర్ట్స్ అథారిటీలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైఫిల్ షూటింగ్‌లో(అండర్–19 విభాగంలో) వెన్నెల పాల్గొని కాంస్య పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా వెన్నెలను పాఠశాలలో వ్యాయామ అధ్యాపకుడు నాగయ్య, కోచ్ నాని, ఉపాధ్యాయులు అభినందించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

నల్లగొండ: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట బుధవారం రెండో రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లాలో 1100 మంది పని చేస్తున్నారని, 20 సంవత్సరాలుగా సరైన వేతనాలు అందడం లేదన్నారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలన్నారు. విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని, రీ ఎంగేజ్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, బొమ్మగాని క్రాంతికుమార్, కంచర్ల మహేందర్, నీలాంబరి, చంద్రశేఖర్, మంజులారెడ్డి, సావిత్రి, పుష్పలత, సాయిల్, వెంకట్, జి వెంకటేశ్వర్లు, నాగరాజు, లలిత, కొండయ్య, యాదయ్య, వెంకట్, ధార వెంకన్న, శ్రీనివాస్, నాగయ్య, రమేష్, వసంత, సుజాత, నిరంజన్, వెంకటకృష్ణ, నాగయ్య పాల్గొన్నారు. సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఫణికుమార్, జానారెడ్డి, భిక్షంగౌడ్, సర్వోత్తమ్‌రెడ్డి, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తలారి రాంబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి మద్దతు తెలిపారు.

రికవరీ ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ : మండలంలోని అవంతీపురం గ్రామానికి చెందిన పలు కుటుంబాలకు మైక్రో ఫైనాన్స్ నిర్వాహకులు మాయమాటలు చెప్పి రుణాలు ఇప్పించి ఈఎంఐలు ఆలస్యమైతే దుర్భాషలాడుతన్న రికవరీ ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐఎంఐ జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫారుఖ్, బీఎంపీ సయ్యద్ మోసిన్, రాంబాబు, గణేష్, వెంకటరత్నం, హరిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అవంతీపురం గ్రామస్తులు

సేంద్రియ సాగుపై శిక్షణ

రామగిరి(నల్లగొండ) : సుభాష్ పాలేకర్ సేంద్రియ సాగులో భాగమైన ఐదు అంచెల వ్యవసాయంపై గో విశ్వకల్యాణ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రెసిడెంట్ బోయపల్లి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం నల్లగొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 15 నుంచి 24వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ కన్హహ గ్రామంలోని రామచంద్ర మిషన్ శాంతివనంలో 10 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఎకరం భూమిలో ఐదెంచల పద్ధతిలో సాగుచేస్తే రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు రాబడి వచ్చేలా మెళకువలు ఇస్తూ శిక్షణ ఇస్తారనితెలిపారు. సమావేశంలో దీక్షితులు స్వామి, విజయ్ ప్రతాప్ మహారాజ్, తండు సైదులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోయపల్లి ప్రభాకర్‌రెడ్డి

నల్లగొండ డీటీసీ ఎస్ఐ బదిలీ

నల్లగొండ క్రైం: నల్లగొండ డీటీసీ ఎస్ఐ పి. బాబును బుధవారం బదిలీ చేస్తూ నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు సూర్యాపేట జిల్లా మఠంపల్లి ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు.

మంత్రాలు వస్తాయనే నెపంతో మహిళపై దాడి

- నలుగురిపై కేసు నమోదు

నార్కట్‌పల్లి, నల్లగొండ క్రైం : మంత్రాలు వస్తాయనే నెపంతో మహిళపై దాడి చేసిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామంలో జరిగింది. బుధవారం నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్‌తో కలిసి సీఐ నాగరాజు విలేకరులకు వివరాలు వెల్లడించారు. అక్కెనపల్లి గ్రామానికి చెందిన ఏనుగుతల దయాకర్ భార్య ఝాన్సీ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. అదే గ్రామానికి చెందిన బెక్కంటి పుల్లమ్మ చేతబడి చేయడం వలనే ఝాన్సీ అనారోగ్యానికి గురవుతుందని అనుమానించి పుల్లమ్మను ఎలాగైనా హతమార్చాలని దయాకర్ కుటుంబ సభ్యులు పథకం వేశారు. ఈ నెల 7వ తేదీన పుల్లమ్మ ఇంటికి వెళ్లి ఆమెతో వాగ్వాదానికి దిగారు. ఎలాగైనా నిన్ను చంపుతాం అంటూ ఆమెను బెదిరించి వెళ్లారు. 9వ తేదీన పుల్లమ్మ కూలీ పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా.. గ్రామ సెంటర్‌లోకి రాగానే దయాకర్ కుటుంబ సభ్యులు కత్తితో ఆమె గదమ, వీపు, చేతులపై దాడి చేశారు. అదే సమయంలో పుల్లమ్మ భర్త యాదయ్య అక్కడకు రావడంతో అతడిని చూసి దయాకర్ కుటుంబ సభ్యులు పరారయ్యారు. పుల్లమ్మ మంగళవారం నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఏనుగుతల దయాకర్, ఏనుగుతల నర్సింహ, ఏనుగుతల జయమ్మ, మిడిదొడ్డి సత్తయ్యపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు సీఐ తెలిపారు.



గాయపడిన పుల్లమ్మ

మూఢ నమ్మకాలను విశ్వసించొద్దు: ఎస్పీ

మూఢ నమ్మకాలను ప్రజలు విశ్వసించొద్దని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూఢ నమ్మకాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనారోగ్య సమస్యలు వస్తే వైద్యులు సంప్రదించాలని అన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మూఢ నమ్మకాలపై కళాజాత నిర్వహించే పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్